

నిర్బంధం దుర్మార్గం : శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి

తిరుపతి టౌన్ : అంగన్వాడీ వర్కర్లపై పోలీసుల నిర్బంధం దుర్మార్గమని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి అన్నారు. న్యాయమైన సమస్యలపై అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న పోరాటంపై పోలీసు జులుం ప్రదర్శించడాన్ని ఖండించారు. తిరుపతి యశోదానగర్ కూడలిలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. నిర్బంధాన్ని ఇలాగే కొనసాగిస్తే రాష్ట్రంలో యావత్ కార్మికవర్గం ఐక్యమై నిరవధిక పోరాటాలకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నపూర్ణ, వాడ గంగరాజు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో కె.ధనలక్ష్మి, వాడ గంగరాజు

పొలంబడి...తడబడి..!

- పంట దిగుబడులూ అంతంతమాత్రమే
- యాజమాన్యంపై రైతుల్లో కొరవడిన అవగాహన
- రసాయనాల వాడకంతో నిస్సారమౌతున్న భూములు

వ్యవసాయంలో చీడ, పీడలను అరికట్టుటకు ఇష్టానుసారంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల సాగు ఖర్చులు పెరిగి, భూసారం క్రమంగా తగ్గిపోతోంది. ఫలితంగా నాణ్యతలేని అంతంతమాత్రపు దిగుబడులు వస్తుండటంతో పాటు రైతులు అపారంగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి, రైతుల్లో సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచడానికి ప్రభుత్వం రూపొందిస్తున్న పొలంబడులు ఏడా కానరాని పరిస్థితి. పొలం బడులు నిర్వహించి తద్వారా రసాయన పద్ధతులకు క్రమంగా స్వస్తి పలికి, రైతుల్లో పకృతి సేద్యంపై మక్కువ పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఓ రైతు పొలంలో 30 మంది రైతులను సమావేశ పరిచి, పంటల్లోని వివిధ మార్పులను క్షుణ్ణంగా పరిశీలించి, వారు ఆ పరిశీలనలపై చర్చించి, సమగ్ర పంటల యాజమాన్యాన్ని అమలు పరుస్తూ, ఆర్థికంగా తగు లాభదాయకమైన నిర్ణయాలను తీసుకుని 'శాస్త్రీయమైన సేంద్రీయ వ్యవసాయం' దిశగా ముందుకు తీసుకెళ్లి తద్వారా రైతు సాధికారతను సాధించడమే పొలంబడి ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం దానికి డాక్టర్ వైఎస్సార్ పొలంబడిగా పేరు మార్చి రైతుల్లో సమగ్ర పంటల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తోంది. అయితే ఆర్భాటం జాస్తి..ఆచరణ నాస్తి అన్న తరహాలో వ్యవసాయ శాఖ పొలం బడులు నిర్వహిస్తుందే తప్ప, చిత్తశుద్ధి ఏమాత్రం కనబర్చడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

- **నిస్సారమవుతున్న భూములు:**

తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 3 లక్షల మంది రైతులు వ్యవసాయ పనులు చేస్తున్నారు. సుమారు 3 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూములున్నాయి. జిల్లాలో ఎర్ర రేగడి నేలలే అధికం. ఆ తర్వాత నల్లరేగడి, బంకమన్ను నేలలు ఉన్నాయి. అయితే జిల్లాలోని నేలల్లో అధిక భాగం నేలల్లో నత్రజని, భాస్వరం, ఫొటాషియం, జింక్, ఇనుము, సూక్ష్మధాతువుల లోపాలున్నట్లు నిపుణులు గుర్తించారు. అధికంగా యూరియా వాడకం, చీడ పీడల నివారణకు కృత్రిమ రసాయనాల వాడకం మూలానా భూముల్లో సారం క్రమంగా తగ్గిపోతోందని కూడా నిపుణులు చెబుతున్న మాట. వరి, వేరుశెనగ, జొన్నలు, రాగి, సజ్జలు, మొక్కజొన్న, చెరుకు పంటలను రైతులు అధికశాతం పండిస్తుంటారు. అయితే చీడపీడల నివారణకు మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల నేలల్లో సారవంతం తగ్గి దిగుబడులు కూడా క్షీణిస్తున్నాయి. గతంలో ఒక ఎకరాకు 60 బస్తాల వరి ధాన్యాన్ని పండించి ఉత్తమ రైతు అవార్డులు అందుకున్న రైతులు ఎంతోమంది ఉన్నారు. కానీ ప్రస్తుత కాలంలో అలాంటి అవార్డులు అందుకుంటున్న వారు అరుదుగా కనపిస్తున్న పరస్థితి. ఎకరాకు 60 బస్తాల మాట అటుంచి నికరంగా 30 బస్తాలు పండినా గొప్పేనని రైతులు భావించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

- **కానరాని పొలంబడులు**

సాధారణంగా పొలం బడి 14 వారాలు అనగా, పంటకాలం పాటు సాగుతుంది. వ్యవసాయ సమగ్ర పంటల సాగు పద్దతులలో నిష్ణాతులైన వ్యవసాయ శిక్షకులు లేకుంటే అధికారులు పొలంబడిలో అధ్యాపకులుగా వ్యవహరిస్తారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం, నాణ్యమైన దిగుబడి పొందడం ఎలాగో రైతులకు నేర్పించాల్సి ఉంటుంది. సహజ సిద్ధమైన వనరులతో సాగు చేయుట, భూసార పరీక్షను బట్టి ఎరువులు వాడుట, వానపాములు, సేంద్రీయ ఎరువుల తయారీపై కూడా రైతులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా రసాయన ఎరువులు తగ్గించుట, విత్తనశుద్ధితో చీడపీడలను నివారించుట, అంతర పంటల ద్వారా మిత్ర పురుగుల వద్ధి చేయడలాంటి కార్యక్రమాలు కూడా పొలం బడి ద్వారానే రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. వ్యవసాయ క్షేత్రాల్లో విరివిగా కనిపించాల్సిన పొలంబడులు అరుదుగా కూడా కనిపించడం లేదు. కొంతమంది కింది స్థాయి వ్యవసాయ సిబ్బందికి పొలంబడులంటే ఏంటో కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు.

నవంబర్ నుంచి : రమేష్, ఏడీఏ, శ్రీకాళహస్తి

ఈ ఏడాది నవంబర్ నుంచి శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ వ్యవసాయశాఖా క్షేత్రంలో పొలం బడులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. పరిస్థితుల దృష్ట్యా గతంలో లాగా పొలంబడులు నిర్వహించని మాట వాస్తవం. సేంద్రియ సేద్యంపై వ్యవసాయ శాఖ తనవంతు కృషి చేస్తోంది. గతంలో దానికంటూ ఓ యంత్రాంగం ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. సమగ్ర పంటల యాజమాన్యంపై రైతుల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు పొలం బడులను, రైతులను గుర్తిస్తున్నాం.

సేంద్రియమంటే చిన్నచూపు: నాగరాజు, మాజీ ఆదర్శ రైతు

రైతు పక్షపాతి ప్రభుత్వమంటూ పాలకులు గొప్పలు చెప్పుకోవడం తప్పా, రైతులకు ఒరగబెట్టేదేమీ లేదు. గతంలో సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీ ఓ ఉద్యమంలా సాగింది. ఆదర్శ రైతులు ఆ బాధ్యతను భుజాన మోశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయమందకున్నా ఎరువులు, పిచికారీ మందులు తయారీ చేసి రైతులకు విక్రయించాం. చివరకు పాలకులు ఏకంగా ఆదర్శ రైతుల వ్యవస్థనే తొలగించింది.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

అంగన్వాడీల నిరసనలో పి.మధు
వామపక్ష కార్మిక సంఘాలు మద్దతు
నేడు జిల్లావ్యాప్తంగా నిరసనలకు పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

తెలంగాణ కంటే ఆంధ్ర రాష్ట్రంలో అంగన్వాడీలకు ఎక్కువ జీతం ఇస్తామని జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయమని కోరితే వారిని అరెస్ట్ చేయడం దారుణమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పెనుమల్లి మధు విమర్శించారు. సోమవారం సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద అంగన్వాడీల పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలపై పని భారం పెరిగినప్పటికీ కనీసం వారి చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని, వేతనాలు పెంచాలని చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడం అన్యాయమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలను అరెస్టులు చేసి రాష్ట్రంలో ఉన్న అన్ని జైళ్లు నింపివేశారని అన్నారు. అంగన్వాడీలు చేసే పోరాటానికి వామపక్ష పార్టీలతో పాటు కార్మిక వర్గం మద్దతు ఇస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో అంగన్వాడీలకు న్యాయం చేస్తామని అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డి ప్రస్తావించకపోవడం సిగ్గుచేటు అన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తే వారిని ఎక్కడపడితే అక్కడ నిర్బంధించి జైలుకు తరలించడం శోచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీలకు వేతనాలు పెంచడమే కాకుండా వారి పని భారం కొంతవరకు తగ్గించారని జగన్ మోహన్ రెడ్డి అర్థం చేసుకోవాలన్నారు. ఎంతమందిని అరెస్టులు చేసిన ఉద్యమం ఆపేది లేదని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ లు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆగవని, కేసులకు కార్మిక వర్గం భయపడదని, విద్యుత్ పోరాటంలో అశువులు బాసిన అమరవీరుల స్ఫూర్తితో రాష్ట్రంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధమవుతుందని అన్నారు. నిర్బంధాలు కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా తమ శ్రేణులు నిరసనలు తెలపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఐఎఫ్టియు నాయకులు వెంకటరత్నం, నాయకులు ఎన్ డి రవి, కె వేణుగోపాల్, పి బుజ్జి, రఘు, తంజావూరు మురళి, డివైఎఫ్ఐ నాయకులు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి, అంగన్వాడీ నాయకులు నాగరాజమ్మ, ఏఐటియుసి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వైయస్ మణి, శ్రీరాములు, శ్రీనివాసులు, మోహన్ రెడ్డి, రజాక్, సురేష్, మహేంద్ర, నరసింహులు, ముద్దుకృష్ణ కనకరాజు పాల్గొన్నారు.

పుత్తూరు నిరసనలో సిఐటియు నాయకులు వెంకటేష్

పుత్తూరులో... అంగన్వాడీల నిర్బంధాన్ని నిరసిస్తూ అంబేద్కర్ సర్కిల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్రలో స్వయంగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీనే అమలు చేయమని అడిగితే అరెస్టు చేయడం దారుణమన్నారు. కనీస వేతనం 26వేలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును పక్కన పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ కుమారి, ప్రమీల ,ధనమ్మ, హైమావతి, అంబికా, అన్నపూర్ణ, యశోద తదితరులు పాల్గొన్నారు.

గూడూరు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - గూడూరు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అందరినీ పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గూడూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మాయాబజార్‌లోని సిఐటియు కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి నాలుగేళ్లయినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అయినా చర్చలు జరిపి పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు నాయకులు జోగి శివకుమార్, దారా కోటేశ్వరరావు, బి.ప్రభావతి, బివి రమణయ్య, సురేష్, ఎ.ప్రసాద్, పి.శంకరయ్య, జి.మధు, బి.పెంచల ప్రసాద్, ఆర్.సుబ్బమ్మ, కె.నారాయణమ్మ, సుబ్బరామమ్మ పాల్గొన్నారు. సూళ్లూరుపేటలో మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. నాయకులు రమణయ్య, సాంబశివరావు, పద్మనాభయ్య పాల్గొన్నారు.

ఏమైనా జరిగే వరకూ అంతేనా..!

సిసి కెమెరాలో పులి ఆనవాళ్లు

మరోసారి చిరుత కలకలం
భయం గుప్పెట్లో ఎస్వీయూ విద్యార్థులు

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సోమవారం తెల్లవారుజామున మరోసారి చిరుత సీసీ కెమెరాలలో కనిపించింది. దీంతో వర్సిటీలోని ప్రకాష్ నగర్ లో, ఇంజనీరింగ్ కళాశాల పరిసరాలలో నివాసం ఉండే విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఎస్వీయూ ఉన్నతాధికారులకు సూచించామని, వారి దష్టికి తీసుకెళ్లామనీ వర్సిటీలో నివసించే సిబ్బంది చెబుతున్నారు. అంతేకాదు విద్యార్థులు, విద్యార్థి సంఘ నేతలు కూడా పలుమార్లు ఉన్నతాధికారులకు చిరుతచే భయం ఉందని వినతి పత్రాలు ఇచ్చామన్నారు. వర్సిటీ ఉన్నతాధికారులకు దీనిపై ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి భద్రత కల్పించే దిశగా ఉన్నతాధికారులు ఆలోచించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. వర్సిటీలో బోన్లను ఏర్పాటు చేసి, ఇక్కడ తిరుగుతున్న రెండు, మూడు చిరుతలను బంధించాలని విద్యార్థి సంఘాల నేతలు రిజిస్ట్రార్ కు విన్నవించినట్లు వారు తెలిపారు. అయితే ఇప్పటివరకు రిజిస్ట్రార్ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారో లేదో కూడా తెలియదని వారన్నారు. ఇప్పటికైనా రిజిస్ట్రార్, అటవీశాఖ అధికారుల సమన్వయంతో క్యాంపస్ లో తిరుగుతున్న రెండు, మూడు చిరుతలను బోను ఏర్పాటు చేయడం ద్వారా బంధించాలని విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వర్సిటీలో తిరిగే చిరుతలను బంధించుకుంటే పరిపాలన భవనం ఎదుట విద్యార్థులు ఆధ్వర్యంలో ధర్నాకు దిగుతామని విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం 6.55 నుండి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. తిరుమాడ వీధులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, ఈవో ఎవి.ధర్మారెడ్డి దంపతులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ సిబ్బందికి వస్త్ర బహుమానం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహనం బేరర్లు, మేళం సిబ్బందికి సోమవారం రాజ్యసభ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కలిసి వస్త్ర బహుమానం అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డి చేతులమీదుగా వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ఈవో ఎవి.ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నట్టు చెప్పారు. వారికి స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. ఆలయ డెప్యూటీ ఈవో శాంతి,ప్రధానార్చకులు ఎపి.శ్రీనివాస దీక్షితులు, ఏఈవో మునిక్రిష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయరావు పాల్గొన్నారు.


తిరుమలలో వేడుకగా రథోత్సవం

భవ్య కేసులో కీచకులను శిక్షించాలి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

పెనుమూరు మండల పరిధిలో నివసిస్తున్న వడ్డెర కులానికి చెందిన భవ్యశ్రీ (17) మృతికి కారకులైన నలుగురు కీచకులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని, కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేయాలని రాయల్స్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపకులు తిరుమలశెట్టి రెడ్డి శేఖర్ రాయల్, బీసీ నేతలు బూసగాని లక్ష్మయ్య డిమాండ్‌చేశారు. ఈనెల 17న ఆదివారం సాయంత్రం భవ్యశ్రీ మిస్సయ్యిందని స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు స్పందించకపోవడం వల్లనే భవ్య హత్యకు గురయ్యిందన్నారు. వినాయక నిమజ్జనం రోజు భవ్యకు చెందిన భూమిలోని బావిలో గణేష్ విగ్రహం వేసిన సమయంలో శవం బయట పడిందన్నారు. అయినా పోలీసులు నిందితులను అరెస్టు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. రాజకీయ హస్తం వల్ల సొమ్ముకు అమ్ముడుపోయారన్న అనుమానం కలుగుతోందన్నారు. సోమవారం క్యాండిల్‌ర్యాలీ నిర్వహిస్తామన్నారు. భవ్య కేసుపై ఎస్పీతో పాటు, సిబిఐ విచారణ చేపట్టాలని కోరారు.

50మంది ఎంఎల్ఎలు మా కూటమికి : జనసేన

తిరుపతి (మంగళం) : బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో ఎలక్ట్రికల్ ధర్మ రథాన్ని దొంగలించి నాయుడుపేట వద్దకు తీసుకెళ్లడంటే దీనికి బాధ్యులు ఎవరని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇన్చార్జి కిరణ్ రాయల్ ప్రశ్నించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ రాయల్ మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తగిన ప్రచారం లేదన్నారు. వైసీపీలోని 40 నుంచి 50 మంది ఎమ్మెల్యేలు జనసేన, తెలుగుదేశం కూటమికి రావడానికి సిద్ధంగా ఉన్నారని, వారిని నివారించడానికే టిడిపి, జనసేన నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలు, శ్రీవారి భక్తుల దష్టిని మరల్చడానికి అధికార పార్టీ ఎత్తులు వేసి మాయలు చేస్తారన్నారు. రాజారెడ్డి, సుమన్ రాయల్, ఆర్ సి మునికష్ణ, వట్టికుంట శంకర్ నారాయణ, మనోహర్ ఆచారి పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

తిరుపతి టౌన్ : నగరపాలక ప్రాథమిక పాఠశాల పట్నాలు వీధి నందు తిరుపతి లయన్స్ క్లబ్బు అధ్యక్షులు బి .మునికష్ణ నాయుడు ఆధ్వర్యంలో కార్పొరేటర్ బసవ గీత చేత విద్య కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ముని కష్ణ నాయుడు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుతున్నది చాలా వరకు పేద విద్యార్థులేనని అందుకే లయన్స్ క్లబ్ తరపున ఉచితంగా విద్యాసామాగ్రి అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు . ఈ కార్యక్రమానికి దాతలు రాజేంద్రప్రసాద్, ఎమ్మార్ రాజాలు ఉచితముగా విద్యా సామాగ్రి వితరణ చేశారు.

కోటలో సీఫుడ్స్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -కోట

కోట మండలంలో నూతనంగా సీ ఫుడ్స్ రెస్టారెంట్‌ను వైసీపీ స్టేట్ సెక్రటరీ పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. సోమవారం కోట మండలంలో ఆక్సిస్ బ్యాంక్ సమీపంలో నూతనంగా సీ ఫుడ్స్ రెస్టారెంట్ ను పి.సురేష్ ఆధ్వర్యంలో అన్ని రకాల సీ ఫుడ్ ఐటమ్స్ అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేశారు. రెస్టారెంట్ ను కోట తా హాసిల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, ఎంపీపీ దాసరిఅంజమ్మ లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిద్దవరం సొసైటీ బ్యాంక్ చైర్మన్ రాధా కష్ణా రెడ్డి, కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు దువ్వూరు. సాయి కష్ణా రెడ్డి, వైసీపీ నాయకులు ఇన్నమాల. వెంకటాద్రి, ఆక్సిస్ బ్యాంక్ మేనేజర్ వెంకయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో రాణించాలి

తిరుపతి(మంగళం): విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో రాణించాలని, ఇందులో ప్రొఫెసర్ల పాత్ర కీలకమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి అన్నారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 2023-24 విద్యా సంవత్సరం బిటెక్ కోర్సుల్లో లేటరల్ విద్యార్థులకు సోమవారం ఓరియెంటేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఎస్వీసీఈలో విద్యార్థి అకాడమిక్ కెరీర్ లో సాధించే గ్రేడ్లు, విజయాలను మాత్రమే పరిగణలోకి తీసుకోనబడతాయని అనుకోవద్దని, విద్యార్థులకు ఉన్న విలువలు, సమాజం పట్ల చూపే ఆదరణ వంటివి పరిగణలోకి తీసుకుంటామన్నారు.

ఖాదర్‌బాషాకు గుర్రం జాషువ స్మారక పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు గుర్రం జాషువ స్మారక జీవిత సాఫల్య జాతీయ పురస్కారాన్ని పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహు భాషా రంగస్థల, టివి, సినిమా కళాకారులు 'ఆల్ ది బెస్ట్' ఖాదర్ బాష షేక్ అందుకున్నారు. ఈ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి హైదరాబాదులోని తెలంగాణ సరస్వత భవనంలో అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మ ఆధ్వర్యంలో జరిగింది.

'చుక్కలు' చూపిస్తున్న 'బిల్లులు'

విద్యుత్ ఛార్జీల భారంతో గగ్గోలు

ప్రజాశక్తి - బాలాయపల్లి

'విద్యుత్ బిల్లులు చుక్కలు చూపించడం ఏంటి? అని అనుకుంటున్నారా..?! ఔనండీ వాస్తవం.. విద్యుత్ బిల్లులు చూసి నిద్రపట్టక ఇళ్లల్లో ఫ్యాన్లు, లైట్లు ఆపేసి ఆరుబయట మంచం వేసుకుని దోమలు కుడుతున్నా పట్టించుకోకుండా ముసుగుతన్ని పడుకునే రోజులు వచ్చేశాయి.. అదనపు ఛార్జీల పేరుతో భారం మోపుతుంటే కొంతమంది వినియోగదారులు విద్యుత్ అధికారులతో వాగ్వివాదానికి దిగుతున్నారు. ఎవరో వాడిన బిల్లులకు తామెందుకు అదనపు ఛార్జీలు చెల్లించాలంటూ అద్దె ఇళ్ల వాళ్లు ఇళ్ల ఓనర్లపై మండిపడుతున్నారు.

ఛార్జీల పేరుతో ప్రభుత్వం కరెంట్ బిల్లులను మోతెక్కిస్తున్నాయి. వేలల్లో వస్తున్న బిల్లులను చూసి పేద, మధ్య తరగతి వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. అసలు ఆ చార్జీలు ఏంటో.. ఎందుకు వేస్తున్నారో.. తెలియని అయోమయంలో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. నెలంతా ఒక్క యూనిట్ విద్యుత్ వాడని వారికీ ఛార్జీల రూపేణా వందల్లో బిల్లులు వస్తుండడంతో లబోదిబోమంటున్నారు. వివిధ రకాల చార్జీలతో తమకొచ్చిన కరెంట్ బిల్లులు పట్టుకుని విద్యుత్‌శాఖాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కొంతమంది తమ బిల్లులను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ప్రభుత్వ నిర్వాకాన్ని ఎండగడుతున్నారు. ఫిక్సడ్, కస్టమర్, ట్రూఅప్ చార్జీలకు తోడు గతంలో ఎన్నడూ చూడని ఎఫ్‌పీసీఏ, ఎఫ్‌పీసీఏ-2, షార్ట్‌ఫాల్ చార్జీలంటూ వినియోగదారుడి దిమ్మతిరిగే స్థాయిలో బిల్లులు అంటగడుతున్నారు. ఏ ఇద్దరి మధ్య సంభాషణ విన్నా ఈ నెలలో మోతమోగిస్తున్న కరెంట్ బిల్లుల గురించే అంటే అతిశయోక్తి కాదు.

2014 నుంచి 2019 వరకు వినియోగదారుడు వాడుకున్న మొత్తం యూనిట్లను లెక్కించి ట్రూఅప్ చార్జీ పేరుతో ఒక్కో యూనిట్‌కు 7 పైసల చొప్పున భారం వేశారు. ఆ మొత్తం భారాన్ని 18 వాయిదాలుగా విభజించి ప్రతినెలా చెల్లించేలా బిల్లులో పొందుపరుస్తున్నట్టు విద్యుత్‌శాఖాధికారులు తెలిపారు. ఈ ట్రూఅప్ చార్జీ అనేది గతేడాది ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చినట్టు చెప్తున్నారు.

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్ మెంట్(ఎఫ్‌పీసీఏ) కింద 2021-22 సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వాడుకున్న వినియోగాన్ని లెక్కించి ఒక్కో యూనిట్‌పై 19 పైసలు చార్జీ విధించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి వినియోగించుకున్న యూనిట్లపై ఒక్కో యూనిట్‌కు 40పైసల చొప్పున ఎఫ్‌పీసీఏ2 చార్జీ కింద అదనంగా వసూలు చేస్తున్నారు. వినియోగ దారుడు ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన లోడ్ వేయించుకుని 2కిలోవాట్ల లోడ్ వాడితే షార్ట్‌ఫాల్ కింద అదనపు చార్జీ బాదుతున్నారు. గడువు తేదీ దాటిన తర్వాత కట్టే బిల్లుల విషయంలోను ఈ షార్ట్‌ఫాల్ చార్జీ వర్తిస్తుందని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వంపై పడిన విద్యుత్ భారాన్ని తగ్గించుకోవడానికి ఇలా రకరకాల చార్జీల పేరుతో వినియోగదారుల నడ్డి విరుస్తున్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాలతో సతమత మవుతున్న సగటు వినియోగదారుడు అదనపు చార్జీల పేరుతో వేస్తున్న భారాన్ని తట్టుకోలేక ఆర్థికంగా చితికిపోతున్నాడు. కరెంట్ వాడని ఇళ్లపై కూడా కనికరం లేకుండా చార్జీల మోత మోగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్ వాడినా వాడకపోయిన కరెంట్ మోత

ఖాళీగా ఉన్న తన ఇంటికి ఈ స్థాయిలో బిల్లు రావడమేమిటని ఓ వినియోగదారుడు ప్రశ్నించారు. ఎఫ్‌పీపీ సీఏ చార్జీ కింద రూ.222, ఎఫ్‌పీసీఏ2 కింద రూ.357, షార్ట్‌ఫాల్ చార్జీ కింద రూ.100, ఇతర చార్జీల కింద రూ.61లను బిల్లులో చూపారని, ఈ అదనపు చార్జీలను భరించాల్సిందేనని సదరు అధికారి సెలవిచ్చినట్టు నిట్టూర్చారు. ఈ ఒక్క కేసే కాకుండా జిల్లాలో చాలామంది వినియోగదారులు భారీగా వచ్చిన విద్యుత్ బిల్లులను చూసి బావురుమంటున్నారు.

రూ.370 రూపాయలు వచ్చింది
సుభారత్నమ్మ, అంబలపూడి గిరిజన కాలనీ



మా ఇంట్లో రెండు లైట్లు ఒక ఫ్యాన్ ఉంది. నెలకి రూ 375 కరెంట్ బిల్లు వస్తుంది. అడిగితే ఏవో చార్జీలు అని చెప్పి మావద్ద విద్యుత్ శాఖ అధికారులు వసూలు చేస్తున్నారు. అడిగితే కుల ధృవీకరణ సర్టిఫికెట్ ఇవ్వు అన్నారు. ఏదో షరతులు అంటా యూనిట్ ఖర్చులు ఏవేవో చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాల తుది జాబితాకు ఆమోదం

- తిరుపతి ఓట్ల నమోదు అధికారి హరిత

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో పోలింగ్ కేంద్రాలపై గుర్తింపు పొందిన జాతీయ రాజకీయ పార్టీల అభిప్రాయాలను సేకరించి తిరుపతి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఆమోదించి జిల్లా ఎన్నికల అధికారి ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు పంపిస్తూ తీర్మానం చేశామని రుపతి ఓటరు నమోదు అధికారి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయం మేరకు 1500 ఓటర్లు దాటిన కేంద్రాలను పరిగణలోకి తీసుకుని విభజించాలనే నిర్ణయం మేరకు 2 కేంద్రాల్లో 1500 ఓటర్ల సంఖ్య దాటడంతో మరో రెండు పోలింగ్ కేంద్రాలు కొత్తగా ఏర్పాటుకు అంగీకారం తెలిపామన్నారు. తిరుపతి నగరంలోని 265 పోలింగ్ కేంద్రాల్లోని 19 పోలింగ్ కేంద్ర స్థలాలను మార్పులు చేయడం, 8 పోలింగ్ కేంద్రాల పేర్లను మార్పు చేశామన్నారు. కొన్ని చోట్ల నాడు నేడు పనుల వల్ల పోలింగ్ బూత్‌లు మారడం, గతంలో ఓటింగ్ కేంద్రాలున్న కొన్ని భవనాలు శిథిలం కావడంతో మార్పులు చేశామని తెలిపారు. ఆయా పోలింగ్ బూత్‌ల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలపడంతో, పార్టీల ప్రతినిధులు చర్చించి ఆమోదించారని కమిషనర్ తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సాయంత్రం తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ప్రత్యేక సమావేశం నిర్వహించి తీర్మానాలపై చర్చించి ఆమోదించారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తిరుపతి నియోజకవర్గం ఓటర్ల నమోదు అదనపు అధికారులు, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, అర్బన్ ఎమ్మార్వో వెంకటరమణ, డిటీ జీవన్ పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలలో జాతీయ స్థాయికి ఎంపిక

రెజ్లింగ్‌పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా విజయవాడ రూరల్ మండలం 'నున్న' వికాస్ విద్యాసంస్థల ఆవరణలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల రెజ్లింగ్ అండర్ 14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో మోహనా చారి బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. నాగరాజు కాంస్య పతకం సాధించారు. క్రీడలలో విజయం సాధించిన విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనం సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల విజయానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పవాణిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మొదటి అసిస్టెంట్ కే బాబు , మోహర్ బాబా , వ్యాయామ ఉపాధ్యాయిని వాణి , రెడ్డప్ప , సోమశేఖర్ రాజు , రాజశేఖర్ పాల్గొన్నారు.

రుణాలపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి -కోట : వైఎస్ఆర్ క్రాంతి పథకం ద్వారా లబ్ధి పొందిన పొదుపు మహిళలు సకాలంలో బ్యాంకులో జమ చేసుకునేలా ప్రతి ఒక్కరూ అవగాహన పెం పొందించు కోవాలని వైఎస్ఆర్ క్రాంతి పథకం ఏరియా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.చంద్రబాబు అన్నారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ గూడూరు డివిజన్ స్థాయిలో 5 మండలాల స్థాయిలో తమ విధులను నిర్వహిస్తామన్నారు. తిరుపతి జిల్లా కార్యాలయం నుండి ఇక్కడకు వచ్చారన్నారు. పొదుపు రుణాలపై ఎలాంటి అవకతవకలు లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకునే విధంగా చూస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భక్తుడు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుమలకు కాలినడకన వెళుతున్న భక్తుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు...తిరుమలకు కాలినడకతో వెళుతున్న చెన్నైకి చెందిన భక్తుడు మణి పుత్తూరు మండలం తడుకు చెక్ పోస్ట్ వద్ద తిరుపతి –చెన్నై జాతీయ రహదారి ఉదయం సుమారు 4.10 గంటల సమయంలో వెళుతుండగా అతివేగంగా మారుతి కారుఢీకొంది. డీ కే మణి తలపై తీవ్ర గాయాలు అయ్యాయి. చెన్నైకి చెందిన భక్తుడు మణి తన మొక్కుబడి తీర్చుకు నేందుకు కాలినడకతో వెళుతున్న సమయంలో పుత్తూరు తడుకు వద్ద తిరుమల వైపు వెళుతున్న సమయంలో టిఎన్ 81 ఎ 3160 నెంబరుగల మారుతీ కారు డ్రైవర్ వెనుక నుండి మణి ని ఢీకొంది. అతడిని తిరుపతి లోని రుయా హాస్పిటల్ కి తీసుకోని వెళు తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చి , వివిధ ప్రైవేట్ పరిశ్రమలలో ఉపాధి కల్పిస్తామని గూడూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గూడూరు ఐటిఐ కళాశాలను స్కిల్ హబ్ గా ఎంపిక చేశారా న్నారు. ఈ స్కిల్ హబ్ లో అసోసియేట్ ఎలక్ట్రీషన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ , కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం 8143576866, 8919925219, 9440168907 ఫోను నెంబర్లను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ లోహెచ్‌టిటిపిఎస్:// ఫార్మాస్.జిఎల్ఇ/యుఎంఎస్ఎక్స్‌సి కెఆర్ఎ 79 ఎంఆర్ఎంఎ లింకులో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠశాలలలో 'నా భూమి - నా దేశం'

నాయకుల చిత్రపటాల ప్రదర్శన నిర్వహిస్తున్నవిద్యార్థులు

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలం లోని పునబాక ప్రాథమి కోన్నత పాఠశాలలో సోమవారం 'నా భూమి నా దేశం' కార్యక్ర మం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భం గా ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీ యులని స్మరించుకుంటూ, రక్షణ కోసం అసువులు బాసిన సైనిక వీరులను స్మరించుకుంటూ విద్యార్థుల్లో దేశభక్తిని రేకెత్తించే మహత్తరమైన కార్యక్రమమే 'నా భూమి– నా దేశం' అని ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులు సేకరించిన మట్టితో నింపిన కలశాన్ని, దేశభక్తుల చిత్రపటాలను, పట్టుకొని ఊరేగించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఏ శ్రీనివాసులు, కమిటీ చైర్మన్ యోగేశ్వరయ్య, అనసూయమ్మ , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్వేతలో టీటీడీ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి లోని శ్వేత శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టీటీడీ డిగ్రీ కళాశా లల అధ్యాపకులకు సోమవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ స్థాయి శిక్షకులు ఎం.నాగరాజు మాట్లాడుతూ త్వరలో టీటీడీ కళాశాలలు కొన్ని అటానమస్ గా మారబోతున్నాయని, ఇందుకోసం అనుసరించాల్సిన విధానాలను తెలుసుకోవాలన్నారు. న్యాక్ గుర్తింపు కోసం మన బలాలు, బలహీనతలు, అవకాశాలు, ప్రతి బంధకాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడీ విద్యాశాఖాధికారి డా. ఎం.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు శిక్షణను సద్వినియోగం చేసుకుని, కళాశాలలను మరింత ఉన్నతికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్వేత డైరెక్టర్ ఎ.ప్రశాంతి, విద్యాశాఖ సలహాదారు మోహన్ కుమార్ రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ మహదేవమ్మ, నారాయణమ్మ, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి దీక్ష

ప్రజాశక్తి -గూడూరు: గూడూరు టిడిపి కార్యాలయంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 13వ రోజులో భాగంగా చిల్లకూరు మండలం టిడిపి కుటుంబ సభ్యులతో కలసి దీక్షలో మాజీ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్,జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు సన్నా రెడ్డి వెంకటరమణా రెడ్డి,చిల్లకూరు మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పూడిపర్తి ప్రవీణ్ రెడ్డి, ముని శేఖర్ గౌడ్, పచ్చవ వెంకటేశ్వర్లు నాయుడు,ప్రధాన కార్యదర్శి నెలటూరుచిరంజీవి, మూగ శంకరయ్య, ప్రదీప్ కుమార్, మండల బీసీ అధ్యక్షులు మేకల్ కుమార్,మైనారిటీ అధ్యక్షులు జకీర్, మహిళా నాయకులు రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి దాసరి శైలజ, మండల మహిళా అధ్యక్షురాలు నెలటూరు సుప్రజ, తెలుగు యువత, మండల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడిపిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి రాక్షసా నందం పొందుతున్న జగన్‌మోహన్ రెడ్డికి సద్బుద్ధి ప్రసాదించమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు రామలింగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అధికార దర్పంతో జగన్మోహన్ రెడ్డి పోలీసు బలగాన్ని అడ్డు పెట్టుకుని బాబుపై కేసులు పెట్టడం కక్ష సాధింపు రాజకీయాలకు పరాకాష్ట అని చలపతి నాయుడు విమర్శించారు. చంద్రబాబు నాయుడు వెంటనే విడుదల కావాలని ప్రార్థించాడు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, ప్రకాష్ నాయుడు, కాసరం రమేష్, డాఎం. ఉమేష్ రావు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మాసిస్టుల దినోత్సవం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: స్థానిక గోకుల కృష్ణ ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్య క్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్ మాట్లాడుతూ మొదటగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు ఫార్మాసిస్టుల పాత్ర , అవయవ దానం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫార్మసిస్టు ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం అనే అంశం మీద విద్యార్థిని విద్యార్థులకు వక్తృత్వ పోటీ, వ్యాస రచన, లోగో, స్లోగన్ పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల జాతీయ సేవ సమితి విభాగం ఆధ్వర్యం లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తదుపరి సూళ్లూరుపేట పట్టణంలో గోకుల కృష్ణ ఫార్మసీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు హోలీ క్రాస్ కూడలి నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఫార్మాసిస్టులు విశిష్టతను తెలియజేస్తూ నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల చైర్మన్ గిలకా బ్రహ్మయ్య అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్,ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ శ్రీదేవి,తొప్పని స్వాతి,ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ పేట శివకుమార్,అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలో వెలసిన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిత్యాన్నదానంకు సూళ్లూరుపేటకు చెందిన కొట్టే వెంకటరమణ సిద్ధాంతి దంపతులు లక్షా పదహారు రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ నగదును ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డికి అందించారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే

విద్యార్థినులకు గుర్తింపు పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి దేవి ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ సేవా పథకం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, క్రీడలచే నిర్వహించే భారత ప్రభుత్వ రంగ సేవా కార్యక్రమం అన్నారు. సమాజ సేవ ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వాన్ని పెంపొందింప చేసే లక్ష్యంతో ఇది రూపొందిం దన్నారు. ఎస్.రాధాకృష్ణ నేతృత్వం లోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ అధికారికంగా విద్యా సంస్థల్లో స్వచ్ఛంద జాతీయ సేవను ప్రవేశపెట్టాలని ప్రతిపా దించారన్నారు. ఎన్ఎస్ఎస్ చిహ్నం గురించి వివరించారు. విద్యార్థినులు చదువుతోపాటు ఇలాంటి సేవా, పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని, కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమం లో జాతీయ సేవా పథకం బాధ్యురాలు, అధ్యాపకు రాలు డా. జి శారద మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సంక్షేమ ఆలోచనల్ని నింపుకొని, విపత్తుల్లో సహాయం అందించడానికి ముందు ఉండా లని, మన కళాశాల, సమాజ పరిసరాలను మన వంతుగా పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థినులకు పిలుపు నిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులకు ప్రిన్సిపాల్ గుర్తింపు పత్రాలు, బహుమతులు అందించి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో అధ్యా పకులు డా. స్నేహలత, డా.జయమ్మ, టి.యామిని సుధ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనం గా నిర్వహించారు. ఈసంద ర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు రెడ్డి మా ట్లా డు తూ కళాశాల నుండి సమాజంలో అధ్యక్ష త వహించడం ఎన్ఎస్ ఎస్ నినాదమని, విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ చేయటం బాధ్యతగా భావించా లన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డా కె. శ్రీనివాసులు, డా.యువజన, రఘురామన్ ప్రసంగిం చారు. ఈ కార్యక్రమంలో వి వీరయ్య, టి నరసింహులు, డా శ్రీనివాసులు, సుజల పాల్గొన్నారు.

నారాయణ కళాశాలలో రక్తదాన శిబిరం

శిబిరంలో రక్తదానం చేసున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ , నారాయణ మెడికల్ కళాశాల నెల్లూరు వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రక్తదానం చేయటం వల్ల ఆపదలో ఉన్నవారిని కాపాడుకోవచ్చు అన్నారు. అనంతరం 150 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ కె. విశ్వక్సేన రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ తరపున నిర్వహించి స్వచ్ఛంద రక్తం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడు తున్నం దుకు తమ కళాశాల విద్యార్థులను అభినం దించారు. మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేలా విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్ అధికారి . కోటేశ్వర్ రావు , ఏ. ఓ కొండారెడ్డి , అధ్యాపక బృందం , వాలంటీ ర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారులు మేల్కోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వస్తు కొనుగోలు విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని నగదు చెల్లింపు విషయంలో జవాబుదారితనం ఉండేలా బిల్లులు తీసుకోవాలని అశ్రా, కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు అరికింబేడు మునిశేఖర్ పిలుపు నిచ్చారు. నవంబర్ 18వ తేదీన ఢిల్లీలో జరిగే అశ్ర 5 వ జాతీయ సమ్మిట్ గోడ పత్రికను వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యు లు శశిధర్ రెడ్డి, తిరుపతి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జడ్జి పార్థసారధి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎప్పుడైనా ఎక్కడైనా వినియోగదా రులకు అన్యాయం జరిగితే ఆసరా సంస్థ సభ్యులకు తెలిపితే వారికి ఉచిత న్యాయ సలహాలు, సేవలు అందిస్తామన్నారు. ప్రతి వస్తువు కొన్న విషయం లో వినియోగ దారులు మోసపోతు న్నారనీ, వినియోగ దారులు కొన్న వస్తువుకు ప్రతిదానికి బిల్లును తీసు కోవా లన్నారు. వినియోగదారుల వివాదాల విషయంలో ఎవరి కి ఎటువంటి సందేహాలు, సమస్యలు ఉన్నా 9550088059 నంబర్ కు ఫిర్యాదు చేసి వినియోగదారుని వివాదాల సమస్యలపై విలువైన సలహాలు, సేవలు పొందవచ్చున్నారు.

వైసిపి కుట్రలు, కుతంత్రాలు ఇక సాగవు..

మాజీ ఆయకట్టు ప్రెసిడెంట్ కైలాసం గోపాల్ రెడ్డి

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులపై

ప్రజాశక్తి ఏర్పేడు: వైసిపి చేస్తున్న కుట్రలు కుతంత్రాలు ఇక ప్రజల ముందు సాగవని, ప్రజలు తిరుగుబాటుకు సిద్ధమయ్యారని దుర్గిపేరి మాజీ ఆయకట్టు సర్పంచ్ కైలాసం గోపాల్ రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీ దుర్గి పేరి గ్రామంలో ప్రజలు పెద్ద ఎత్తున చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. బాబుకు తోడుగా నేను అనే కార్యక్రమంలో భాగంగా ఈ కొవ్వొత్తుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కైలాసంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి నిత్యం ప్రజల్లో ఉంటున్న ప్రజానాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు. అలాంటి వ్యక్తిని కనీసం వయసు కూడా చూడకుండా అక్రమ కేసులుతో ఈ సైకో ముఖ్యమంత్రి సబ్ జైల్లో పెట్టారని చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రోడ్డుపైకి వచ్చి శాంతియుతంగా నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులపై పోలీసులు కేసులు బనాయించి సబ్ జైల్లో పెట్టి బాధించారన్నారు. ఇవన్నీ సామాన్య ప్రజలు చూస్తూ ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం మీద తిరుగుబాటు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమన్నారు. అనంతరం దుర్గి పేరి గ్రామంలో కొవ్వొత్తులతో ఏర్పేడు వెంకటగిరి రహదారి నుండి రాములవారి గుడి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రెడ్డి ,తిరుపాల్ రెడ్డి, మునిరత్నం రెడ్డి, కెవి రమణ, మునిమా నందరెడ్డి, మునీంద్ర బాబు ,గణేష్ ,శేషాద్రి, శ్రీనివాసులు ,శేఖర్ రెడ్డి, హరి రెడ్డి ,బాబు రెడ్డి ,ముని రామయ్య పాల్గొన్నారు.

మోడల్ మండలాల ఈఏవోలకు శిక్షణ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని వై ఎస్ ఆర్ క్రాంతి పథకం కార్యాలయంలో మోడల్ మండలాలకు శిక్షణ తరగతులను వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.చంద్రబాబు, ఏపీఎం రత్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో సీసీ, సంఘ బంధం అధ్యక్షులు, ఈ ఏ ఓ లకు 25 వ తేది నుండి 28 వ తేది వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ముందుగా సీసీ లు శ్రీకాంత్, కృష్ణమ్మ తిరుపతి జిల్లా లో శిక్షణ తీసుకున్నారు.స్థానిక కార్యాలయంలో శ్రీకాంత్, కృష్ణమ్మ లు కలిసి సంఘ బంధం అధ్యక్షులు,ఈ ఏ ఓ లకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీసీ లు ప్రసాద్, భాస్కర్ లు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండు

ప్రజాశక్తి-వెంకటగిరి: ప్రభుత్వ స్థలాలలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజా సంఘల ఐక్యవేదిక నాయకులు కోరారు. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాలలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలపై ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య మాట్లాడుతూ వెంకటగిరి పట్టణంలో జడ్పీహెచ్ఎస్ బాలికల స్కూల్ వెనుక భాగంలో దక్షిణం వైపులో తూర్పు వీధిలో వెంకటగిరి గ్రామకంఠం సర్వే నెంబర్.279. బిల్డింగ్ కట్టడంలో బావి ప్రభుత్వ స్థలం దాదాపు 6 అంకణాలు లలో ఎలాంటి ప్రభుత్వాలు అను మతులు లేకుండా అక్రమ నిర్మాణ లు చేపట్టుతున్నారన్నారు. వెంకటగిరి టౌన్ సర్వేనెంబర్ 230–1లో 0.35 నదీ పరంబోకు ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్230–2 లో 1.04 సెంట్లు గయాల ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 231–1 లో0.011 సెంట్లు పోరంబో కు ప్రభుత్వ భూములలో అప్పుడు సర్వే నెంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని అక్రమ కట్టడాలు చేస్తున్నారు . పాత బస్టాండు, సాయిబాబా గుడి తూర్పు వైపు ప్రభుత్వ స్థలం మురికి కాలవపై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వెంకటగిరి టౌన్ సర్వేనెంబర్ 220/2ఎ లో దాదాపు 30 సెంట్లు ప్రభుత్వ భూమిని దురాక్రమణ చేసి నది బంపర్ జోన్ నిబంధనలు కూడా పాటించకుండా ప్రహరీ గోడ నిర్మాణం చేసి యథేచ్ఛగా కంకర వ్యాపారం నిర్వహిస్తున్నారన్నారు. అయితే ఇదే స్థలాలలో నివాసం లేని నిరుపేద ప్రజలు జీవన బతుకుతెరువు కోసం ఆక్రమించుకుంటే వెంటనే సంబంధిత అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను కూలదోస్తారన్నారు. ఇక్కడ ఆక్రమించుకున్న వారందరూ అగ్రకుల అధికార అంగ బలం ఉన్నవారు కావడంతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపాల్టీ అధికారులు ఇకనైనా అధికారులు స్పందించి వాటిపై సమగ్రమైన సర్వే చేసి మున్సిపాలిటీ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కోరుతున్నారు. లేని పక్షంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక వెంకటగిరి టౌన్ అధ్యక్షులు రఫీ పాల్గొన్నారు.

శ్రీ చైత్ర హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ చైత్ర హాస్పిటల్ ను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ దేశాయి తిప్పారెడ్డి సోమవారం ప్రారంభించారు. దేవేంద్ర థియేటర్ సమీపంలోని అశోక్ నగర్ లో ఏర్పాటుచేసిన ఆసుపత్రి వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ సంబంధిత వ్యాధులు, గైనకాలజీ చికిత్సలను అందించేందుకు అత్యాధునిక సౌకర్యా లతో శ్రీ చైత్ర హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినంద నీయమన్నారు. ఆ ఆసుపత్రి అధి నేతలు డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వైద్య పరికరాలతో పాటు అత్యాధు నిక మౌలిక వసతు లు కల్పిం చా మన్నారు. విశేషాలు భూమి కలిగిన వైద్యులు కిడ్నీ సంబంధిత వ్యాధులు, గర్భకోశ వ్యాధులు తదితర వాటికి ఇక్కడ చికిత్స అందిస్తున్నా మన్నారు. ఐదు అంతస్థల ఈ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన సిబ్బంది వైద్య సేవలు అందిస్తా రన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏఆర్ రెడ్డి, పలువురు ప్రముఖ వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ లలితాకరుణాకర్

పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని పాపానాయుడు పేట గ్రామ పంచాయతీ లో స్వచ్ఛతాహి సేవలో భాగంగా సర్పంచ్ లలితా కరుణాకర్ అధ్యక్షతన పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానిం చారు. అనంతరం కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి ఎంహరికృష్ణ, సచి వాల యం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

వరదయ్యపాలెం: పారిశుద్ధ్య కార్మికులు నిజమైన హీరోలని వరదయ్యపాలెం బసిరెడ్డి అన్నారు. సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ జ్యోతి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సేవ వెలకట్టలేనిదని వారి వల్లే పంచాయతీ నుండి మున్సిపాలిటీ వరకు ప్రతి గ్రామం పట్టణం అద్దంలా మెరుస్తుందని పరిశుభ్రత లేకపోతే అనారోగ్యాల పైన పడి వివిధ రోగాలను ఎదుర్కొనే పరిస్థితి దాపురి స్తుందని వాటన్నిటి నుండి ప్రజలను సమాజాన్ని కాపాడుతున్న పారిశుద్ధ్య సైనికులను కార్యక్రమం ద్వారా సన్మానించడం ఎంతో గొప్ప విషయమన్నారు.ఈ కార్యక్ర మంలో సచివాలయ సిబ్బంది, జడ్‌పిటిసి వెంకటేశ్వర్లు, వైసిపి యూత్ లీడర్ వినోద్ యాదవ్, వార్డు మెంబర్లు, వాలంటరీలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపిడివో

శ్రీకాళహస్తి రూరల్: మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్ అధ్యక్షతన స్వచ్ఛ తాహి సేవా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నివసించే ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రంగా ఉంచడంలో హరిత రాయబారులు అలుపెరగని సైనికులు వలె పని చేస్తున్నారన్నారు. మండలంలో ప్రతి హరిత రాయ బారికి పూలమాలవేసి దుశ్శాలువతో సన్మానిం చడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. జీతాలు బకాయి లు ఉన్న ప్రతి హరిత రాయబారికి త్వరలోనే జీతాలు అందేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రభురావు, ఆయా పంచాయతీల సెక్రటరీ లు, ఎంపీటీసీ లు హరిత రాయబారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఏర్పేడు : వచ్చే నెల 5వ తేదీ ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారు లు సూచించారు. మండలంలోని ఆమందూరు గ్రామ పంచాయతీలోని బాలకృష్ణాపురంలో ఆరోగ్య సురక్షలో భాగంగా సిహెచ్ఓ కె దీప, ఆశ వర్కర్ గుర్రం జయ చిత్ర తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. వచ్చే నెల 5వతేదీ ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

27 న ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కెమిస్ట్రీ విభాగం బయోసైన్స్ రీసర్చ్ ఫౌండేషన్ సంస్థ, కాంచీపురం వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27 వ తేదీన బుధవారం కళాశాల లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఎం యస్ సి కెమిస్ట్రీ, ఎంయస్‌సి జువాలజి పూర్తి చేసిన వారు , ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులన్నారు. ఈ ఉద్యోగాలకి నెలకి 17 వేలు రూపాయలు జీతం వుంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెస్యూమ్‌తో పాటు మార్క్స్ లిస్ట్ జిరాక్స్, ఒరిజినల్ ఐడి ప్రూఫ్ తో ఈ నెల 27 వ తేదీన కళాశాల లో జరిగే జాబ్ మేళా లో ఉదయం 10 గంటలకి కళాశాల సెమినార్ హాల్‌లో హాజరు కావాలని రాత పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్ఆర్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు కళాశాల జేకేసి సమన్వయకర్త సంధ్య ఆదూరి 8801325220 ఫోను నెంబరుకు, సమన్వయకర్త ఎంఎస్‌సి డా యం శంకర్ రావు, కెమిస్ట్రీని 9491806362 ఫోను నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కందాటి శంకర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన మిత్రులు సోమవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. స్థానిక రుయా ఆసుపత్రి వద్ద జరిగిన కార్యక్రమంలో కందాటి శంకర్ రెడ్డి కుమారుడు కందాటి మిథిన్ రెడ్డి, శంకర్ రెడ్డి స్నేహితులు పాతగుంట గిరి, విజయ్ కుమార్ మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం తిరుపతి మున్సిపల్ చైర్మన్ గా కందాటి శంకర్ రెడ్డి తిరుపతిని అనేక రకాలుగా అభివృద్ధి చేశారన్నారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజయ్, అమ్ములమ్మ, వసంతమ్మ, సత్యవతి, శ్రీలత, రాజమ్మ, రమేష్, చంద్రారెడ్డి, శరత్, వాసు, తులసి రామ్, సుబ్రహ్మణ్యం, మస్తాన్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల పరిధిలోని నేతాజీ నగర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సోమవారం స్థానిక ఎంఈవోలు మునిశేఖర్, కృష్ణయ్య తనిఖీ ఏశారు. ముందు పాఠశాలల వివిధ రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యా విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేసిన మెనూ ప్రకారం అందించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో నాడు నేడు పనులు, రికార్డులు పరిశీలించారు.

ఘనంగా జాతీయ సేవా పథక దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో జాతీయ సేవా పథక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య విద్యావతి ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎన్ఎస్ఎస్ లో ఉన్న 15 యూనిట్లు జరిపిన క్యాంపులు గురించి, రెగ్యులర్ ఆక్టివిటీస్ గురించి వివరించారు. ఈ నివేదిక లో జాతీయ వాతావరణ దినోత్సవం, ఎంఎండిఐ పంచ్ ప్రాణ్, కార్గిల్ దివస్, ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ వారోత్సవాలు, "మేరే మిట్టి మేరే దేశ్ ", ఆజాది కా అమృత్ మహోత్సవ్ లో భాగం గా నిర్వహించిన విషయాన్నీ ప్రస్తావిం చారు. మొక్కలు నాటి కార్యక్రమాన్ని పాతసాణంభట్లు పల్లెలో జరిపిన విషయాన్నీ గుర్తు చేశారు. ప్రీ రిపబ్లిక్ డే సెలెక్షన్స్, పౌష్టిక ఆహార దినోత్సవాల్ని గురించి తెలియజేశారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమ ప్రాముఖ్యతని తెలిపారు. ఉప కులపతి ఆచార్య. డి. భారతి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజంలో ఎలా భాగస్వామ్యం కావాలి? ఎలా మన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి? చదువుతూ సేవా చేయటానికి ఎన్ఎస్ ఎస్ ఒక చక్కటి అవకాశాన్ని కల్పిస్తుందని, దాన్ని ప్రతీ విద్యార్థిని వినియోగించుకోవాలని కోరారు. డీన్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆచార్య కె. అనురాధ మాట్లాడుతూ ఎన్ఎస్ఎం మోటో "నాట్ మీ బట్ యు " ఎటువంటి లాభాపేక్ష లేకుండా సమాజం లో భాగం కావటం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని అందరూ దానిని వినియోగించుకోవాలని తెలిపారు. డీన్ ఆఫ్ సైన్సెస్, సుజాత , నర్సింగ్ ప్రిన్సిపాల్ డా.గంగా భవాని, డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, ఆచార్య కె. అనురాధ, ప్రాముఖ్యత ను తెలిపారు. విద్యార్థులకు జరిపిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.

IN THE COURT OF SENIOR CIVIL JUDGE OF SRIKALAHASTHI
I.A. NO. 526 / 2019, O.S. NO. 21 / 2019

N. Santhi .... Plaintiff
And
R. Sarojamma & 18 others .....Defendants

NOTICE TO RESPONDENT NO.8

పై దావాలో A.V. చలపతి రెడ్డి 5వ ప్రతివాదికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీగా గుర్తించమని కోరుతూ పిటిషను I.A. NO. 526 / 2019 వేసి ఉన్నారు. కోర్టు వారు అనేకసార్లు 8వ రెస్పాండెంట్ M. మహేంద్ర రెడ్డి, S/o రఘురామి రెడ్డి, గుంటక్రిందపల్లి గ్రామం, శ్రీకాళహస్తి మండలం, తిరుపతి జిల్లా అయిన నీకు నోటీసు జారీ చేసినప్పటికి నీవు అందుకోనందున ప్రత్యా మార్గంగా దినపత్రిక ద్వారా నోటీసు జారీచేసినందున నీవు వాయిదా 19–10–2023 న స్వయంగా గాని వకీలు ద్వారా గాని కోర్టు నందు హాజరై అభ్యంతరములున్న తెలుపుకోవలసినది. లేనియెడల పిటిషను నీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు,
ఇ. భక్తవత్సల నాయుడు, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు తరపు న్యాయవాది, శ్రీకాళహస్తి.

IN THE COURT OF MACT - II AT THIRUVALLUR (SUB- COURT LEVEL)
M.C.O.P. No. 98 OF 2023

Mrs. Savithiri .... Petitioner
Vs
1. Prasanthi Tatikonda
2. The Manager
National Insurance co. Ltd. .....Respondents

To
R1. Mr. Prasanthi Tatikonda, D/o T. Malakondaiah, No.20-1-416/18/C10, Subash Nagar, Korlagunta, Thirupati Urban, Thiruapti District, Andhara Pradesh, Pin code - 517501.

PUBLIC NOTICE

This is to inform you that the above plaintiff is filed ariginal petition against to you for grant of compensation for the grievous injuries sustained by her in road accident which occurred on 16.12.2022 at about 06.30 AM at Kanakamma Chathiram by pass road. In this regard, the Hon'ble MACT-II, at Thiruvallur, was pleased to order public notice to you in M.C.O.P. No. 98/2023 returnable by 04-10-2023.

Hence, you are requested to appear either in person or through your consel on 04.10.2023 at 10.30 AM, before Hon'ble Hon'ble MACT-II, at Thiruvallur, to put forth your objections if any on that day, failing which the matter will be decided in your absence.

R. Ramesh, B.A., B.L.,
Advocate,
Cell No. 9751166982
Counsel for Petitioner.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE, TIRUPATI
L.P. No. 21 OF 2020

BETWEEN :
Y. Venkataramana Naidu .... Petitioner
AND
P. Rajendra Naidu & others .....Respondents

NOTICE TO THE RESPONDENTS

To)
R.11. S. Jayarama Naidu, S/o Chengama Naidu, residing at House No. 139, 1st floor, 4th cross, Postal Colony, Renigunta road, Tirupati.
R.12. Smt. D. Vani Priyadarsini, W/o Raveendra Kumar, residing at D.No. 13-5-531/B1/8, Tata Nagar, Tirupati.
R.23. Y. Narasinhulu Naidu, father's name not known to the Petitioner, residing at D.No. 22-9-57/3A, 2nd Left, Opp. to Krishna Mandir, Seethapathi Reddy Layout, New SBI Colony, Cotton, Mill Road, Renigunta Road, Tiruapti.
R.24. Neelakanta Reddy, father's name not known to the Petitioner, residing at D.No. 10-6372, C/o Neelakanta Tiffin Centre, SubbaReddy Nagar, Karakambadi Road, Tirupati.
R.27. V. Venkataramana, father's name not known to the Petitioner, residing at D.No.618, Korlagunta Maruthi Nagar, Tiruapti.
R.30. G Ramachandraiah, father's name not known to the Petitioner, residing at D.No. 11/139/1, Yogimallavaram, Tiruchanoor Post, Tirupati.

Please take notice that the Petitioner filed the above Debtor I.P. against you & others and the same is posted to 18.10.2023 for your appearance before the aforesaid Hon'ble Court at 10.30 A.M., either in person or through an advocate and file your objections if any; otherwise the matter will be dcided exparte.

Aloor Pratap, B.A., B.L.,
Advocate for Petitioner.